క్లుప్తంగా

మహిళా రిజర్వేషన్ బిల్లును సవరించాలి



బెజ్జంకిలో ధర్నా చేస్తున్న డీఎస్పీ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): మహిళా రిజర్వేషన్-2023 బిల్లులో సవరణలు చేసి బహుజనులకు లబ్ధి చేకూర్చాలని ధర్మ సమాజ్ పార్టీ నియోజకవర్గ నాయకుడు లింగాల సురేశ్ డిమాండ్ చేశారు. మహిళా బిల్లుకు వ్యతిరేకంగా శనివారం డీఎస్పీ (ధర్మ సమాజ్ పార్టీ) ఆధ్వర్యంలో బెజ్జంకిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ 2023 బిల్లుకు మద్దతు ప్రకటించిన పార్టీలు రిజర్వేషన్‌లపై కూడా వెల్లడించాలన్నారు. 93 శాతం ఉన్న బడుగు, బలహీన, మైనార్టీలకు నష్టం చేసే చర్యలని ఆరోపించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సూచనల మేరకు సిద్దిపేట ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో అంబిటస్ పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు మోహన్ శనివారం తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో మానసిక ఒత్తిడికి గురవుతున్న ఉపాధ్యాయులకు ఉచితంగా వైద్యపరీక్షలు చేస్తారన్నారు. కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్ హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో ట్రెజరర్ రవి తదితరులు పాల్గొన్నారు.

పోతన రచనలు ఆదర్శం



పోతన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహాకవి బమ్మెర పోతన రచనలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని కవి శ్రీచరణ్ సాయిదాస్ అన్నారు. పోతన జయంతి సందర్భంగా శనివారం సిద్దిపేటలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీచరణ్ సాయిదాస్ మాట్లాడుతూ జనరంజకంగా పోతన రచనలు ఉంటాయని, ఆయన జీవితం స్ఫూర్తి నింపుతుందన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట కవులు ఉండ్రాళ్ళ రాజేశం, బస్వరాజ్ కుమార్, మిట్టపల్లి పరశురాములు, కేసుగారి రాములు, బెజుగామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక టికెట్ ఇవ్వండి

దుబ్బాక: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గం నుంచి బీసీ వర్గానికి చెందిన మహిళ కత్తి కార్తీక గౌడ్‌కు కాంగ్రెస్ టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలిపించి సోనియమ్మకు గెలుపును బహుమతిగా ఇస్తామని దుబ్బాక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని కత్తి కార్తీక క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 50 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ దుబ్బాకలో బీసీలకు టికెట్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నిర్వహించిన హాత్ సే హాత్ జోడో యాత్రలో కార్తీక 3 వేల కిలోమీటర్లు ఆయనతో పాదయాత్ర చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయితేజ గౌడ్, దీపక్ సాయి, సాయగౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

ఇంటి పన్ను కింద ఆసరా పెన్షన్ జమ

చేర్యాల(సిద్దిపేట): ఆకునూరు గ్రామంలో వృద్ధులకు, దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పెన్షన్‌ను పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఇంటి పన్ను కింద జమ చేస్తున్నారని పలువురు పెన్షన్‌దారులు ఆరోపించారు. శనివారం రాత్రి కార్యదర్శి బాలయ్య, సిబ్బంది పెన్షన్ తీసుకునేందుకు వచ్చే వృద్ధుల నుంచి బలవంతంగా ఇంటి, నల్లా పన్నుల బకాయిలను వసూలు చేస్తుండగా వారు వ్యతిరేకించడంతో కార్యదర్శి అక్కడి నుంచి వెళ్లి పోయినట్లు స్థానికులు తెలిపారు. ఆసరా పెన్షన్‌ను బలవంతంగా పన్ను కింద జమ చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చీపురు పట్టి .. రోడ్లను ఊడ్చి..

- పరిశుభ్రతపై అవగాహన కల్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు
- శుభ్రతతో వ్యాధులు దూరమని సూచన



రామవరం గ్రామంలో రోడ్లను ఊడుస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని రామవరం, గౌరవెల్లి గ్రామాల్లో శనివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్లను ఊడ్చి, చెత్తాచెదారం తొలగించారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కవికుమార్, రామవరం గ్రామ సర్పంచ్ వనపర్తి స్వప్న రేష్, గౌరవెల్లి సర్పంచ్ బైరగోని పుష్పలీల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాంబరాజు, మాజీ జెడ్పీటీసీ మాలోతు భీలునాయక్, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లింగాల సాయిన్న, ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బైరగోని శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మాలోతు నిర్మల, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యకర వాతావరణం ఏర్పడుతుందని బెజ్జంకి ఎంపీపీ లింగాల నిర్మల పేర్కొన్నారు. బెజ్జంకిలో శనివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం సందర్భంగా విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి మావహారం నిర్మించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించి శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దమ్మని రాము, ఏఎంసీ చైర్మన్ కచ్చు చంద్రకళ, సర్పంచ్ ద్యావనపెల్లి మంజుల, కోఆర్డినేటర్ చెన్నారెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛత పాటిస్తే..

చిన్నకోడూరు(సిద్దిపేట): పరిసరాలు, వ్యక్తగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు ప్రబలవని సర్పంచ్ జయవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని సికింద్లాపూర్ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా తడి పొడి చెత్త నిర్వహణ, కంపోస్టు తయారీ, ప్లాస్టిక్ వాడకం అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రతీ ఒక్కరు పరిశుభ్రత పాటించాలని, ఇంటి సమీపంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్లాస్టిక్ విని యోగం తగ్గించాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు బాలయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభివృద్ధి

డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజ్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజక వర్గంలో 30 ఏళ్లుగా ప్రతిపక్ష నాయకులూ లేకుండా అధికార పార్టీ నాయకులే పాలిస్తున్నారన్నారు. కానీ, నియోజకవర్గ ప్రజలకు చేసిందేమి లేదని ఆరోపించారు. దీంతో ప్రజల చూపు కాంగ్రెస్ పార్టీ వైపు ఉందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మీసం మహేందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జయంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్

సిద్దిపేటజోన్: క్రీడలు ఉజ్వల భవిష్యత్‌కు పునాది వంటివని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో యువతీ యువకులకు పరుగు, లాంగ్ జంప్, హై జంప్ వంటి 56 క్రీడాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 550 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను రాజనర్స్ ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారు సెప్టెంబర్ 30, అక్టోబర్ 1న కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, లెక్చరర్లు కనక చంద్రం, శ్రీనివాస్ రెడ్డి, అశోక్, రాజ్యలక్ష్మి, సుధాకర్ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్వామి, రామేశ్వర్, ప్రభు, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడిగా భూపాల్



భూపాల్‌ను సన్మానిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన దొమ్మాట భూపాల్ నియమితులయ్యారు. శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మున్సిపల్ యూత్ అధ్యక్షుడిగా నియమించిన ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి చేస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆస యాదగిరి, ఇల్లెందుల శ్రీనివాస్, కోఆప్షన్ మెంబర్ స్వామి, నాయకులు పల్లె రామస్వామి, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు

కోహెడ(హుస్నాబాద్): మండలంలో యూరియా కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్యాక్స్ కార్యాలయానికి యూరియా వచ్చిందని తెలుసుకున్న శనివారం రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. యూరియా కోసం క్యూలో నిలుచున్నారు. కార్యాలయ సిబ్బంది కూపన్లు జారీచేసి యూరియా సరఫరా చేశారు. కాగా మండల కేంద్రంలోని ఆగ్రోస్, డీసీఎంఎస్, ఆకా, మన గ్రోమోర్‌కు యూరియాను సరఫరా చేసి యూరియా కష్టాలు తీర్చాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

పాపన్న స్ఫూర్తితో ఉద్యమిద్దాం

గీత పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు

చేర్యాల(సిద్దిపేట): సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకు ఉద్యమిద్దామని గీత పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు 13వ రోజుకు చేరాయి. దీక్షలో పట్టణ గౌడసంఘం నాయకులు కూర్చొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న వారసులుగా డివిజన్ సాధన కోసం చేస్తున్న పోరాటంలో భాగస్వాములై ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. దీక్షను జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్ ప్రారంభించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రూప్-1 రద్దు



కేసీఆర్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న బీఎస్పీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రూప్-1 అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బీరకాయల వివేక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీతో ఒకసారి, సరైన నిర్వహణ లేకపోవడంతో రెండో సారి గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు రద్దయ్యాయన్నారు. ఈ పరీక్షలు నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. పరీక్షలు రాసిన అభ్యర్థుల భవిష్యత్‌ను అగమ్యగోచరంగా మార్చారన్నారు.

కేసీఆర్ ఫ్లెక్సీ దహనం

గజ్వేల్‌రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందని బీఎస్పీ నాయకులు ఆరోపించారు. గ్రూప్ 1 పరీక్ష రద్దును నిరసిస్తూ శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆందోళన చేపట్టారు. సీఎం కేసీఆర్ ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. 1300 మంది విద్యార్థుల ఆత్మబలిదానాలతో ఏర్పడిన స్వరాష్ట్రంలో ఉద్యోగాల కల్పనలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. టీఎస్‌పీఎస్‌సీ కమిషన్‌ను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాశ్, నియోజకవర్గ ఇన్‌చార్జీలు నరేష్, వినోద్, కోశాధికారి కరుణాకర్, ఉపాధ్యక్షుడు ఎల్లం, కోశాధికారి కరుణాకర్, ప్రధాన కార్యదర్శి రమణాకర్, సభ్యులు కనకప్రసాద్, కరుణాకర్, సుధాకర్, రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మహోత్సవం



కట్కూర్ గ్రామంలో మాట్లాడుతున్న ఎంపీపీ మాలోతు లక్ష్మీ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కట్కూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అశోక్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యురాలు సుదేష్ణ, సీడీపీఓ జయమ్మ, సూపర్‌వైజర్లు రేణుక, సుజాత, కవిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి



ప్రభుత్వ బాలుర కళాశాలలో ఎన్ఎస్ఎస్ లోగో ఆకృతిలో విద్యార్థులు

హుస్నాబాద్: జాతీయ సేవా దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ బాలికలు, బాలుర జూనియర్ కళాశాలల్లో వేర్వేరుగా శనివారం ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలల ఆవరణలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. బాలుర, బాలికల కళాశాల ఆవరణలో విద్యార్థులు ఎన్ఎస్ఎస్ లోగో రూపంలో మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ నల్లా రాంచంద్రారెడ్డి, దేవస్వామి మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సేవా భావం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కరుణాకర్, రణధీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీఎస్పీ జెండా గద్దె కూల్చివేతపై ఆగ్రహం



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

దుబ్బాక: బహుజన దండయాత్ర సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇటీవల సిద్దిపేటలో ఎగురవేసిన జెండా గద్దెను కూల్చివేయడంపై దుబ్బాక నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు జింక సంజీవ్ మండిపడ్డారు. శనివారం దుబ్బాకలో ఆయన మాట్లాడుతూ..సిద్దిపేట గడ్డ హరీశ్‌రావు అడ్డా అని చెప్పుకునే నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సిద్దిపేటలో జెండా ఎగురవేయడంతో ఓటమి భయంతో అర్ధరాత్రి జెండా గద్దెను కూల్చడం దారుణమన్నారు. గద్దెను కూల్చిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు అనాజీపూర్ సంజీవ్, రమేష్, శంకర్, రాజు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కుంకుమార్చన.. అన్నదానాలు



చేర్యాల(సిద్దిపేట): చేర్యాలలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

గణేశ్ నవరాత్రులు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. మండపాల్లో కొలువైన గణనాథుడు భక్తుల పూజలు అందుకుంటున్నాడు. శనివారం మహిళలు కుంకుమార్చన చేయగా, మండపాలకు వచ్చిన భక్తులు పూజలు చేశారు. భక్తులకు మండపాల నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం వేళల్లో మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



హుస్నాబాద్‌లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్



దుబ్బాకలో కుటుంబ సమేతంగా వినాయకుడికి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత



ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట) అంబిక అర్కేడ్‌లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలు



సిద్దిపేటకమాన్: గరికతో పూజ చేసిన భక్తులు



చిన్నకోడూరులో బజరంగ్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్న సభ్యులు

సంక్షిప్త వార్తలు

◆ సడక్ బంద్‌ను జయప్రదం చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల డివిజన్ సాధన కోసం ఈనెల 29వ తేదీన జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన సడక్ బంద్‌ను జయప్రదం చేయాలని జేఏసీ నాయకుడు చేట్కూరి కమాలకర్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం దూల్మిట్ట మండల కేంద్రంలో జేఏసీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప చరిత్ర కలిగిన చేర్యాల ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఈప్రాంత ప్రజల చిరకాల స్వప్నమన్నారు.

◆ ఎమ్మెల్సీని కలసిన ఉపసర్పంచులు

కొమురవెల్లి(సిద్దిపేట): రాష్ట్ర రైతుబంధు అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి శనివారం మండలంలోని ఉపసర్పంచులు కొమురవెల్లి ఉపసర్పంచ్ శ్రీధర్ ఆధ్వర్యంలో కలిశారు. తమ గ్రామాల సమస్యలను ఎమ్మెల్సీకి వివరించారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో రసులాబాద్ ఉపసర్పంచ్ సురేష్, గౌరయపల్లి ఉపసర్పంచ్ ఎండీ షాదుల్లా, తపాస్‌పల్లి ఉపసర్పంచ్ రుద్రారం కనకయ్య, బాలకృష్ణ, కృష్ణ తదితరులు ఉన్నారు.

◆ నిరుపయోగంగా పాఠశాల భవనం

చిన్నకోడూరు(సిద్దిపేట): లక్షలు వెచ్చించి నిర్మించిన పాఠశాల భవనం నిరుపయోగంగా మారడంతో పిచ్చి మొక్కలతో నిండిపోయింది. మండల పరిధిలోని జక్కాపూర్ మదిర నర్సింలపల్లిలో లక్షలు వెచ్చించి ప్రాథమిక పాఠశాల భవనం నిర్మించారు. కొన్నేళ్లకు నర్సింలపల్లి గ్రామస్తులు జక్కాపూర్ రావడంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది.

◆ ప్రభుత్వ బడుల్లో గుణాత్మక విద్య

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ బడుల్లో గుణాత్మక విద్య లభిస్తుందని రామంచ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అబ్దుల్ షరీఫ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని రామంచ పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు ఉన్నాయని, సుశిక్షితులైన ఉపాధ్యాయులు బోధిస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించాలన్నారు. ప్రభుత్వ బడుల్లో అందించే ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వివరాలు తలిపారు.

◆ భూమికి బదులు భూమి ఇవ్వాలి

గజ్వేల్‌రూరల్: భూ నిర్వాసితులకు న్యాయం చేసి రింగురోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని అసంపూర్తిగా ఉన్న రింగురోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత రైతు రాంచంద్రం గతంలో కేజీబీవీ నిర్మాణంలో రెండెకరాలు, తాజాగా రింగు రోడ్డు నిర్మాణంలో మరో రెండెకరాలు కోల్పోతున్నాడన్నారు. రైతుకు భూమికి బదులు భూమి ఇచ్చి న్యాయం చేయాలన్నారు.

◆ సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నంగునూరు(సిద్దిపేట): గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంక్ వివరాలు, ఓటీపీ అడిగితే చెప్పొద్దని ఎస్ఐ మోహన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం రాత్రి రాజగోపాల్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో ముండ్రాయిలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సోషల్ మీడియా ప్రభావం, సైబర్ మోసాలు, మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మత, మహిళల రక్షణపై అవగాహన కల్పించారు. సైబార్ మోసగాళ్ల బారినపడితే వెంటనే ఎన్‌సీఆర్‌పీ లేదా టోల్ ఫ్రీ నంబర్ 1930, 100, 112కు ఫోన్ చేయాలన్నారు.

◆ సభను విజయవంతం చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): అక్టోబర్ 4వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఉప కులాల హక్కుల పోరాట సమితి ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు దాసు శనివారం పిలుపునిచ్చారు. మండలంలోని గాగిళ్లాపూర్‌లో ఆత్మగౌరవ పోస్టర్‌లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 57 ఎస్సీ ఉపకులాలు ఐకమత్యగా పోరాడి హక్కులు సాధించుకోవాలన్నారు. అనంతరం ఎస్సీ 57 ఉపకులాల పోరాట సమితి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా దర్శనం భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా దర్శనం శ్రీనివాస్, శంకర్, సారయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి స్వామి, సభ్యులు పాల్గొన్నారు.

◆ ప్లాస్టిక్ బియ్యం కలకలం

కోహెడరూరల్(హుస్నాబాద్): లబ్ధిదారులకు ప్రతీ నెల ఇచ్చే రేషన్‌బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కోహెడ మండలం వింజపల్లి గ్రామానికి చెందిన గీకురు రేణుకకు ప్రతీ నెల 30 కిలోల రేషన్ బియ్యం తీసుకొంటోంది. సెప్టెంబర్ కూడా అదేవిధంగా తీసుకుంది. శుక్రవారం రాత్రి కుటుంబసభ్యులు భోజనం చేశారు. వారికి తీవ్ర కడుపునొప్పి రావడంతో అనుమానం వచ్చి పరిశీలించగా అవి ప్లాస్టిక్ బియ్యం అని గుర్తించారు. 30 కిలోల బియ్యంలో సుమారుగా మూడు కిలోల ప్లాస్టిక్ వచ్చినట్లు గుర్తించారు. ఈ విషయం మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధికారులు విచారణ జరిపి అవి ప్లాస్టిక్ బియ్యమా? కదా? అనేది తేల్చాల్సి ఉంది.

◆ నిబంధనలు పాటించాలి

నంగునూరు(సిద్దిపేట): వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. శనివారం రాజగోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్, మైనర్లు వాహనాలు నడిపితే పడే శిక్షలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

◆ అంగన్‌వాడీ టీచర్ మృతి

వర్గల్(గజ్వేల్): మండలంలోని మైలారం అంగన్‌వాడీ టీచర్ పోతగల్ల విజయలక్ష్మి(42) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కొద్దిరోజుల క్రితం అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరింది. చికిత్స పొందుతూ మృతి చెందింది. అంగన్‌వాడీ టీచర్ మృతికి సీడీపీఓ వెంకటరాజమ్మ సంతాపం తెలిపారు.